నింపబడి ఉంది.

దేవాలయ మూల విరాట్ రామలింగేశ్వరు డైన ఈ దేవాలయం ప్రధాన శిల్పి రామప్ప పేరుతో రామప్పగుడిగా ప్రఖ్యాతిలోకి వచ్చింది. ప్రతాపరుద్రుని కాలంలోనూ ముస్లిం దండయాత్రలవల్ల శిల్ప సంపదలో అత్యధికభాగం నేలమట్టమయ్యాయి.

కాకతీయ వంశం ప్రారంభంనుంచి 13వ శతాబ్దంలో ఆ వంశం అంతరించేవరకూ రాజులు, రాణులు, సైన్యాధిపతులు తదితరులు అత్యద్భుతమైన శిల్పాలయాలను నిర్మించారు.

క్రీస్తుశకం 1198 నుంచి 1262 వరకు పరిపాలించిన గణపతిదేవ చక్రవర్తి వరంగల్లు కోటను, దాని మధ్యన స్వయంభూ దేవాలయాన్ని నిర్మింపజేశాడు. కుతుబ్‌షాహిల సైన్యాధిపతి అయిన షితాబ్‌ఖాన్ ఆ దేవాలయాన్ని నేలమట్టం చేశాడు.

[illegible]

''రామప్పగుడి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని పడిపోవడానికి సిద్ధంగా ఉంది. గుడి పైభాగంలోని కప్పు, స్తంభాలు ఒక్కొక్కటి ముక్కలై కింద పడిపోతున్నాయి. చేకుకర్రి స్తంభాలపై దీని శిఖరం ఆధారపడి ఉంది. పురావస్తు శాఖ చేపట్టిన పనిలో నాణ్యత, నైపుణ్యత లేదు.

— ధరణీ ప్రగడసత్యమూర్తి

# ఆత్మహత్య!




ఇంటర్వ్యూ బోర్డు మెంబరు రామనాథం— ఇతర బోర్డు మెంబర్లయిన రంగనాథం, వెంకట్రావులతో— ''ఈ సారి వచ్చే కేండేటుని నేను నా తెలివితేటల్తో ఎలా పంపించేస్తానో చూడండి'' అన్నాడు. రామనాథం ఎలా పంపుతాడా అని రంగనాథం, వెంకట్రావులు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు.

అసలు విషయమేమిటంటే, ఉన్న ఒక్క పోస్ట్ ఆల్రెడీ ఎవరికో అమ్మేసి, 'దాన్ని' ముగ్గురూ పంచేసుకొన్నారు. అందుకే ఒక్కొక్కర్నీ ఒక్కోరకంగా అవమానపరచో, కుంటిసాకులు చెబుతూనో పంపించేస్తున్నారు.

''మే ఐ కమిన్'', చాలా స్మార్ట్‌గా ఉందా కంఠం. కానీ, ఆ కంఠస్వరం వెనుక ఎన్నో అవమానాలు, ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్ళి వచ్చిన అనుభవం దాగి ఉన్నాయని వీరికేం తెలుసు?

''యస్, కమిన్'' పిలిచాడు రామనాథం. అతను ముగ్గుర్నీ విష్ చేసాడు. రామనాథం కుర్చీ చూపించాడు. ''థ్యాంక్స్'' చెప్పి కూర్చున్నాడు. చేతిలోని సర్టిఫికేట్లని రామనాథానికి అందించాడు. అతని పేరు శ్రీరాం.

''మిస్టర్ శ్రీరాం...''తో ప్రారంభించి ప్రశ్నల వర్షం కురిపించాడు రామనాథం. అన్నింటికీ టకటకా సమాధానం చెప్పాడు— శ్రీరాం ఎం.ఏ., గోల్డ్ మెడలిస్ట్. కానీ, ప్రశ్నలన్నీ ఐదో తరగతి, ఆరో తరగతి ప్రశ్నలడిగి, శ్రీరాంని కొద్దిసేపు హింసించాడు రామనాథం.

రంగనాథం, వెంకట్రావులు శ్రీరాంని చూసి విహోదిస్తూ, రామనాథం సెన్సాఫ్ హ్యూమర్‌కి మనసులోనే మెచ్చుకున్నారు.

''మిస్టర్ శ్రీరాం, నిన్నూ, నీ క్వాలిఫికేషన్సూ చూస్తుంటే, నాకెందుకో మా వివరి అమ్మాయిని నీకు ఇవ్వాలనిపిస్తోంది. ఏమం టావ్?'' ప్రశ్నించాడు రామనాథం. రంగనాథం, వెంకట్రావులు నిర్ఘాంతపోయారా ప్రశ్నకి. శ్రీరాం ఊహించని ప్రశ్న అది అంతమంది పెద్దల మధ్య ఒప్పుకోకపోతే బావుండదని తలూపాడు 'సరే'నన్నట్లు.

''సరే నువ్వింక వెళ్ళొచ్చు. మా అమ్మాయికి పెళ్ళయిపోయింది'' కొంటెగా చెప్పాడు రామనాథం. మిగతా ఇద్దరూ నవ్వాపుకోలేక ఘొల్లున నవ్వారు. శ్రీరాం మనసుపై గట్టిగా కమ్చీ దెబ్బ తగిలింది! కోలుకోలేనంత దెబ్బ! అతని గుండె ధైర్యం మీద, అనుభవం మీద, అందం మీద, వరుసగా కమ్చీ దెబ్బలు! మెల్లిగా ఫైల్ తీసుకొని బైటికి నడిచాడు.

ఇది జరిగిన రెండు రోజుల తర్వాత—

''బాబూ శ్రీరాం, నీ ఊపిరిని నువ్వే తీస్కున్నావు. ఇరవై ఆరేళ్ళకే నీకు నూరేళ్ళు నిండాయి. పరలోకంలో నీ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ—'' నీ అమ్మా, నాన్న.

శ్రీరాం శ్రద్ధాంజలి పేపర్లో చదివి నిశ్చేష్టుడయ్యాడు రామనాథం. అతని చావుకు నువ్వే కారణం అన్నట్టు అతని అంతరాత్మ వేలెత్తి చూపిస్తోంది.

—ఎ. వెంకట వేణుగోపాల్